# రెండు జడల అమ్మా!!

ఇసుకపల్లి దక్షిణామూర్తి

**గోపాలం** తల పట్టుకుని కుర్చీలో కూలబడి ఉండటం చూసి "మళ్ళీ ఎవరన్నా అందమైన అమ్మాయి కనపడిందా....?" అంటూ వచ్చింది కమల. చేతిలో చీపురు ఉంది. ఊడుస్తూ ఊడుస్తూ అటు వచ్చింది.

"తలకాయ పట్టుకుని కూర్చుంటే ఇప్పుడు జరిగేది ఏమిటి? ఆ జాగ్రత్త తాళికట్టే ముందే ఉంటే సరిపోయేది...." అంది మళ్ళీ.

"ఫో....అవతలకు..." అన్నాడు గోపాలం దేవదాసు పోజుపెట్టి.

"పొమ్మంటే పోవటానికి పనిమనిషి నేమిటండీ... ఇక్కడ కూర్చోమన్నా కూర్చునేది లేదు. అవతల బోలెడంత పని ఉంది .." అంది.

కమల అద్దంముందు నిలబడింది. లావైన పెదిమలు. కొంచెం నొక్కుకుపోయిన ముక్కు—అన్నిటికన్నా చాయ—నలుపు. పెళ్ళిముందు చామనచాయ అని చెప్పారు. మెర్క్యురీ దీపం ముందు అట్లాగే కనపడింది గోపాలానికి. పెళ్ళి గూడా రాత్రిపూటే జరిగింది. పందిట్లో మెర్క్యురీ దీపాలే పెట్టారు. పగటిపూట అసలు రంగు బయటపడింది. ముఖం నల్లగా ఉన్నా, కళ్ళు రెండూ పింగాణీతో చేసినట్లున్నాయి. పెద్ద పెద్ద కళ్ళు. కొంతవరకు నయమే అనుకున్నాడు. సిగ్గు దొంతరల కనురెప్పలకింద ఆ కళ్ళు అటూ ఇటూ కదులుతూ ఉంటే ఫరవా లేదులే—కొంత మంచి, కొంత చెడు—అను



*రూపసౌందర్యానికి మించిన ఆకర్షణ లేదు. కనుకనే దారిద్ర్యాన్ని కూడా మించిన మహాపాపం అనాకారితనం. అయినా అంత సౌందర్యం, ప్రేమించగల శక్తి ఉంటే సాధించలేనిది ఉండకపోవచ్చు.*

కున్నాడు. తాళి కట్టడం అయిపోయింది కాబట్టి కమల అంటే ఆ కళ్ళనే ధ్యానం చెయ్యవచ్చు అనుకున్నాడు. కళ్ళు నవ్వుతాయని ఎక్కడో చదివాడు. కమలంపూలవంటి కమల కళ్ళల్లో ఆ నవ్వుకోసం వెతికాడు. కనపడ్డట్టే కనపడి మాయమవుతుండేది ఆ మందహాసం. ఆ కళ్ళ గురించి కావ్యాలల్లవచ్చు అనుకున్నాడు. కావ్యానికి కావలసిన అతి ముఖ్యమైన పరికరాలు—తెల్ల కాగితాలు, సిరా, నిఘంటువు, బజారునుంచి తెచ్చాడు.

కాపరానికి వచ్చిన కొత్తలో 'నీకళ్ళు ఎంత అందంగా ఉన్నాయి కమలా' అంటూ దగ్గరకు తీసుకున్నాడు. కళ్ళచుట్టూ ఉన్న నల్లటి శరీరం అతనికి చికాకు కలిగించింది. 'చేపల్లాంటి ఆ కళ్ళు చూస్తే.....నీ పేరు, కమల, ఎంత సార్థకమయిందా అనిపిస్తుంది....' అన్నాడు. కమల అద్దంలో ముఖం చూసుకుని వచ్చింది. నిజమే కామోలు అనుకుంది.

'నీ పేరు "మీనాక్షి"..అని పెట్టితే ఇంకా బాగుండేది....ఆ చేపల్లాంటి కళ్ళు...' అన్నాడు గోపాలం.

'ఛీ . ఛీ ..... చేపలు, కోళ్ళు మాట ఎత్తుతా రేమిటండీ....వంటింట్లో' అని విసుక్కున్నట్లు నటించింది.

ఆ సరాగం అలా సాగుతుండగా ఒకనాటి రాత్రి గోపాలం నిద్రలో "మీనాక్షీ.....మీనాక్షీ...." అంటూ కలవరించాడు. కమల మేలుకుని ఆ మాట విన్నది.

తెల్లవారి లేవగానే "మీనాక్షి ఎవరండీ?" అని అడిగింది.

గోపాలం తెల్లబోయాడు. "నా పెట్టె తీశావా?" అన్నాడు.

'పెట్టెలో ఏదో రహస్యం ఉంది కాబోలు.... రాత్రికి తీసిచూడాలి' అనుకుంది కమల.

"ఏం. ..తియ్యగూడదా?"

"ఎందుకు తియ్యగూడదు? అయినా అడక్కుండా తియ్యట మెందుకు?"

"నా కా మాత్రం స్వతంత్రం లేదా?"

"స్వాతంత్ర్యం.... గణతంత్రం...అంత దూరం పోక..." అన్నాడు.

"నేను మీ అంత చదువుకోలేదు లెండి" అంది కమల. "ఇంతకీ మీనాక్షి ఎవరో చెప్పరన్నమాట ..."

"మీనాక్షి ఎవరంటే?....ఆ పేరుతో కోటి మంది ఉంటారు. ఎవరి సంగతి నువ్వడిగేది?"

"ఊర్లో వాళ్ళసంగతి నా కెందుకు? మీరు కలవరించే మీనాక్షి సంగతి నే నడిగేది."

"నీ కేమన్నా బుద్ధి ఉండి మాట్లాడుతున్నావా ....నేను మీనాక్షి గురించి కలవరిస్తున్నానా....ఎవరన్నా వింటే నవ్విపోతా రనన్నా ఉండాలి" అన్నాడు గోపాలం చిర్రు బుర్రులాడుతూ.

"మరి అన్నీ తెలిసి అర్ధరాత్రి 'మీనాక్షీ.... మీనాక్షీ...' అంటూ కలవరించా రెందుకని?" అంది కమల. గోపాలం ముఖం మీనాక్షి అంత అయింది.

"నిజంగా కలవరించానా!"

గోపాలం కుర్చీలో మళ్ళీ తల పట్టుకుని కూర్చున్నాడు. అతనికి జరిగిన సంగతులన్నీ కథల్లో చెప్పిన మాదిరిగా, సినిమా రీళ్ళ మాదిరిగా గుర్తుకు వచ్చినాయి. కమల వంక చూశాడు. ఇంకా నల్లగా కనపడింది. 'ఆ ముక్కేమిటి అట్లా ఉంది?' అనుకున్నాడు. కళ్ళవంక చూశాడు. మరీ పెద్దవిగా కనపడ్డాయి. ఒకసారి కమల నవిమనిషిని గదమాయిస్తుంటే చూశాడు. కళ్ళు సిబ్బిరేకులంత అయ్యాయి. కళ్ళల్లోనుంచి తుపాకి గుళ్ళు కురుస్తున్నాయి. హడలిపోయాడు. ఈ కళ్ళేగా కమలపూలు అనుకుంది అని విస్తుపోయాడు. ఇప్పుడు మళ్ళీ అట్లా కనపడ్డాయి. గోపాలం అట్లాగే తల పట్టుకుని గదిలోకి పోయి మంచంమీద పడుకుని 'మీనాక్షీ....మీనాక్షీ..' అని లోపల లోపల కలవరించాడు.

కమల ఆ రాత్రి పెట్టె అంతా గాలించింది. ఎన్నో ఉత్తరాలు. ఎన్నో జాతకాలు. ఎన్నో ఫోటోలు. డైరీ....డైరీ చదివి తను అపోహ పడ్డట్లు, గోపాలం క్షమించమన్నట్లు, తను వీల్లేదు పొమ్మన్నట్లు, అతను ఇల్లు విడిచి పారిపోబోయినట్లు, తను వెంబడి పరుగెత్తి అతని కాళ్ళు పట్టుకుని కింద పడేసినట్లు, అంతా పోగయినట్లు—అంతా పీడకలలా ఒక్కసారి వచ్చి పోయింది. ఇదంతా ఎక్కువగా సినిమాలు చూడటంవలన వచ్చిన ఇక్కట్లు అనుకుంది. డైరీ తీసి చదివింది. దాంట్లో విశేషాలు ఏమీలేవు. చాకలి పద్దు, వంకాయలు రెండణాలు, కొతిమేర అర్ధణా బాపతు లెక్కలు ఉన్నాయి. ఒకచోట మటుకు రెండు ముక్కలున్నాయి...

"మీనాక్షి లేని నా జీవితం అక్షిలేని మీనం వంటిది"—అని. అది ఒకటి రెండుసార్లు చదివింది. అదన్నమాట సంగతి అనుకుంది. ఉత్తరాలు చదివింది. గోపాలం తాతయ్య వ్రాశాడు అన్నీ. తండ్రి వ్రాసినవి గూడా కొన్ని ఉన్నాయి. ఆ ఉత్తరాల్లోనే గోపాలం తల్లి కూడా కొంచెంగా వ్రాసింది. ముగ్గురూ ముగ్గురు పిల్లల్ని పెళ్ళి చేసుకోమని వ్రాశారు. ఎందుకు ఆ పిల్లనే చేసుకోవాలో కారణాలు, అవసరాలు అన్నీ వ్రాశారు. ముగ్గురు చెప్పిందీ నిజమే. ముగ్గుర్నీ చేసుకోవలసిన అవసరం, బాధ్యత ఉన్నాయి. బహుభార్యా నిషేధ చట్టం అమలులో లేకపోతే కొంచెం సాహసంచేసి ఉండేవాడు. ఇవన్నీ ఒక ఎత్తు, మీనాక్షి ఒక ఎత్తు. ఆ అమ్మాయి అన్నయ్య, తనూ కలిసి చదువుకున్నారు. ఒకసారి వాళ్ళింటికి పోతే మీనాక్షి కాఫీ తీసుకువచ్చి ఇచ్చింది—అదీ తన చేతికి ఇచ్చింది. చిటికినవేలు కొంచెం తగిలి ఎలెక్ట్రిక్ షాక్ తిన్నవాడై కాఫీ కింద పడేసి తను పడిపోయేటంత పనయింది.

"మా చెల్లెలు...." అన్నాడు స్నేహితుడు. గోపాలం విశ్వేస్మృడయ్యే ఉన్నాడు ఇంకా. మాటా లేదు, పలుకూ లేదు. నోట్స్ కావాలని, మాథమాటిక్సు అర్థం కావడంలేదనీ, 'కంబైన్డు స్టడీ' అని రాకపోకలు హెచ్చించాడు. వచ్చినప్పుడల్లా మీనాక్షి కాఫీ అందిచ్చేది. ఆ కాఫీ ఎంత బాగుండేదని! సరాసరి ఇంద్రుడు దిగివచ్చి 'కొంచెం అమృతం తాగిపోదువు గాని రావయ్యా' అంటే 'ఇక్కడ కాఫీ వదిలిపెట్టి రాలేనయ్యా..' అని చెప్పేవాడు.

"మీనాక్షి పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాం.." స్నేహితుడు వెంకటరావు అనేటప్పటికి తన గుండె అనే భావిలో నిరాశ అనే బండరాయి పడేసినట్లయింది. ఆరడుగుల మనిషి ఆ రంగులా లయ్యాడు.

"ఆదేమిటి? ఆదేమిటి?" అని తెల్లబోయారు అక్కడివాళ్ళు.

"మంచినీళ్ళు...." అన్నాడు బలవంతాన. కాసిని ముఖానకొట్టి, కాసిని నోటికి అందిచ్చారు.

ఆ రోజు సాయంత్రం కాలేజీలో వెంకటరావును కలుసుకొని "నాకూ మా వాళ్ళు పెళ్ళి చేద్దామనుకుంటున్నారు..." అన్నాడు.

వెంకటరావు వెళ్ళి గోపాలం సంగతి తలితండ్రులతో చెప్పాడు. వాడిముత్తాతలు ఎవరు? మేనమామలు ఎవరు? అన్నదమ్ము లెంతమంది? ఆస్తి వివరా లేమిటి? వగైరా లేమిటి?—అన్ని కనుక్కొమన్నారు.

అన్నీ బాగానే ఉన్నాయి అనుకున్నారు. తండ్రి ఆఖరికి అడిగాడు. "మరి అయితే అబ్బాయి.... మొన్న మనింటికి వచ్చినప్పుడు ఫిట్సు వచ్చి పడిపోయాడట....ఏమన్నా నుస్తీ మనిషా?" అని.

వెంకటరావుకుఅనుమానం వేసింది. ఇంట్లో వాళ్ళకుసెనుభూతం వేసింది.

"కట్నం ఏమీ అక్కరలేదుట..." అన్నాడు వెంకటరావు.

"ఇంకా అనుమానం ఎందుకు? మూర్ఛ

## కొత్త శీర్షిక

నిత్యనూతనత్వం అభిలషించే ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక పాఠకుల కోరకు త్వరలో మరొక కొత్త శీర్షిక ప్రారంభించ నున్నాము.

—ఎడిటర్



ఏటికి...

ఫోటో—డేవిడ్ క్రిస్టొఫర్ (ఖర్గపూర్)

# రెండు జడల అమ్మాయి

రోగం ఉండే ఉంటుంది ..." అన్నాడు తండ్రి. తల్లి నిట్టూర్చింది.

మీనాక్షి బాధపడింది. అది ఫిట్సు కాదని తెలుసుకుంది. ఆ సంగతి ఎవరితోనూ చెప్పలేక ఊరుకుంది.

గోపాలం వాళ్ళింటికి పోవటానికి ఆంక్ష వేశారు. "కలిసి చదువుకోకపోతే ప్యాసు కాకపోవు" అన్నాడు తండ్రి.

గోపాలం మీనాక్షి ఫోటోకోసం పడ్డ తాప త్రయం పగవాళ్ళకైనా అక్కరలేనిది. దొరక్క పోవటంవలన చివరకు తనే బొమ్మలు వేసు కున్నాడు. కింద ఆ అమ్మాయి పేరు వ్రాశాడు. ముందర పేరు చదివి అమ్మాయి బొమ్మ చూడాలి.

గోపాలం చిక్కి శల్యమైపోదా మనుకున్నాడు. ఒంటిపూట భోజనాలు, ఉపవాసాలు చేసినకొద్దీ అతనికి ఆకలి పెరిగి, ఆరోగ్యం ఎక్కువై మనిషి మరింత లావయి నిగ నిగ లాడటం మొదలు పెట్టాడు. ఇంటి దగ్గరనుంచి ఒత్తిడి ఎక్కు వయింది. అమ్మాయిల పేర్లు చీట్లమీద వ్రాశాడు. కళ్ళు మూసుకుని చీటీ తీశాడు. విడతీసి చూశాడు. 'వెంకాయమ్మ' అని పేరు వచ్చింది. డోకు వచ్చినంత పనయింది. చీట్లు మళ్ళీ వ్రాసిచూశాడు. ఈసారి కమల పేరు వచ్చింది. కళ్ళు గుర్తుకు తెచ్చుకున్నాడు. అబ్బ! అబ్బ!! అనుకుని "నాన్నా...నాన్నా నా పెళ్ళి ఖాయం చెయ్యి" అని ఉత్తరం వ్రాశాడు. ఎవ రినో వ్రాయనందుకు ఆయన కంగారు పడు కుంటూ వచ్చి సంగతి సందర్భాలు తెలుసు కున్నాడు. ఊళ్ళో ఒక అమ్మాయి ఉందని, ప్రేమ పిచ్చిలో పడ్డాడని, వెంటనే పెళ్ళి చెయ్యకపోతే అసలు పిచ్చిలో పడతాడని హడలిపోయి పందిరికి తాళ్ళు కట్టించి, గోపాలంచేత కమల మెళ్ళో తాడు వేయించాడు. తాళి కట్టేముందు, పెళ్ళికూతురి ముందు తెర తీయగానే గతుక్కు మనటం కమల గూడా చూసింది... 'ఎక్కడికి పోతాడులే..' అని ఊరుకుంది.

ఎక్కడికి పోతాడు? కమల చేతుల్లో చిక్కుకు పోయాడు. కమల కాపురానికని వచ్చినప్పుడు ఇల్లంతా బోసిగా ఉంది. కమల రాగానే గోపాలానికి కంపరమెత్తింది. ప్రతి వస్తువు నల్లగా కనపడ సాగింది. పౌర్ణమినాడు చంద్రుడి తెల్లని వెలుగు కంటె చుట్టూరా ఆకాశం నల్లని రంగు ఎక్కువ కొట్టవచ్చినట్లు కనపడేది. అవును చూస్తే గేదెలాగా నల్లగా కనబడింది. కృష్ణశాస్త్రిగా రన్నట్లు ఒకొక్కసారి 'సెందురుడే నలుపు'గా కనపడేవాడు.

ఇంటినిండా బొమ్మలు తెచ్చాడు. అంతా సినిమా తారలు. అందులో ఆడవాళ్ళు—అంద మైనవాళ్ళ చిత్రాలతో గోడలు గూడా సుంద రంగా రూపొందినాయి.

"దేవుళ్ళ ఫోటోలు తీసుకుని రాగూడద టండీ..." అని కమల ఒకసారి ధైర్యంచేసి అడి గితే, ముఖం చిట్లించి ఊరుకున్నాడు. ఇంటి గోడలనిండా పరాయి ఆడవాళ్ళ ఫోటోలు ఉండటం కమలకు కొంచెం తలనొప్పిగానే ఉంది. గోపాలం నోటు పుస్తకాల్లో గూడా సినిమా తారల బొమ్మలు చూసింది.

ఒక రోజు గోపాలం సాయంకాలం ఇంటికి వచ్చేసరికి గోడమీద ఫోటోలన్నీ తీసి దాచేసింది. సౌందర్య హీనంగా ఉన్న గది చూసేటప్పటికి గోపాలం ఆ గోడల మాదిరిగా తెల్లబోయాడు.

"ఏమి టిదంతా?" అన్నాడు ముక్కు చివర కోపాన్ని విదిలించివేస్తూ.

"ఇంట్లోకి రండి....చెబుతాను..." అంది కమల చేతిలో అట్లకాడ వెనక్కు పెట్టుకుని. అప్పుడే వంటింటిలోనుంచి వచ్చినట్లుంది.

"చెప్పే దేమిటో.....ఆ అట్లకాడ ఇంట్లో పడేసి వచ్చి చెప్పు" అన్నాడు గోపాలం.

కోపం తగ్గి నవ్వు వచ్చింది కమలకు. అట్ల కాడనీ, నవ్వునీ వంటింట్లో వదిలేసి కోపం ముఖానికి పూసుకుని మరీ బయటకు వచ్చింది. "ఒకమాట అడుగుదా మనుకుంటున్నాను..." అంది కమల.

"ఎంతకాలంనుంచీ?" అన్నాడు గోపాలం.

"పెళ్ళి అయినవాటినుంచీ..."

"ఇంతకాలం ఎందుకు ఆగావు?"

"నా అనుమానం నిర్ధారణ అయ్యేదాకా ఆగాను."

"ఇప్పుడు ఖాయం అయిందా?"

"ఖాయం చేసుకుందామనే..."

గోపాలం బూట్లు విడిచి వంకరపోయిన కీళ్ళను సరిచేసుకుని, వాసన కొడుతున్న మేజో ళ్ళను చివరగా ఎడంచేత్తో పట్టుకుని దూరంగా విసిరేశాడు.

"కాసిని మంచినీళ్ళు—చల్లనివి తీసుకువచ్చి... అడుగు.. " అన్నాడు గోపాలం. కమల నీళ్ళు తెస్తే కాసిని ముఖాన కొట్టుకుని, కాసిని తాగి, మిగిలినవి చేతిలో పెట్టుకుని "ఇక అడుగు...." అన్నాడు.

"నేనంటే ఇష్టంలేదా మీకు?" కమల సూటిగా అడిగింది.

"ఎందుకు లేదు?"

"ఎదురు ప్రశ్న వేయగానే సరిగాదు...ఈ అందమైన వాళ్ళ ఫోటోలన్నీ గదిలో తగిలించి నన్ను అవమానిస్తున్నా రెందుకు?"

"అందుకని తీసేశావా వాటిని?"

కమల కళ్ళల్లోకి నీళ్ళు వచ్చినాయి. తన బాధకంటె గోపాలం నిర్లక్ష్యమైన సమాధానాలు మరింత దుఃఖ కారణా లయినాయి.

"నే నిష్టం లేకపోతే....నన్నెందుకు చేసు కున్నారు?" అని వలవలా ఏడుస్తూ వంటింటి లోకి వెళ్ళి కుంపటిముందు కూలబడింది. మోకాళ్ళలో తలదాచుకుంది నిప్పుకోడి ఇసకలో దాచుకున్నట్లు...

"ఇప్పుడు ఎంత అందంగా ఉన్నావని .." అన్నాడు గోపాలం.

"నా ముఖం కనపడటం లేదు గనుక" అంది కమల తల ఎత్తకుండానే. గోపాలం సముదాయించ బోయాడు.

"నేనేం గుడ్డిదాన్నా! కుంటిదాన్నా!! సంసారం చేయటానికి వచ్చానుగాని, సినిమాల్లో వేషం,

వేయడానికి, నాటకంలో డ్యాన్సు చెయ్యటానికి రాలేదు......మీకంత ఇష్టం లేకపోతే మా ఇంట్లో దిగద్దేసి రండి....అప్పుడైనా మీకు సుఖంగా ఉంటే అదే చాలు.. " అంది కమల. ఆ మాటలు అందిగాని తెలుగు సినిమాలు, నవలలు చదవటం వలన వచ్చిన మాటలుగా కనబడి నాలుక కరుచుకుంది.

"అయితే సాయంత్రం బండికి పద...." అన్నాడు గోపాలం.

కమల అప్పుడు తల ఎత్తింది.

"నిజంగా వెళతా ననుకున్నారేమిటి? ఈ ఇంట్లోనుంచి మీ ఇష్టం కానప్పుడు వెళ్ళిపోవటానికి మీ పనిమనిషి నేం కాదు. మీ కెంతో నాకూ అంత హక్కు ఉంది ఇక్కడ ..." అంది కమల.

"అహా....అంతవరకు వచ్చిం దేమిటి? ఇంకేమన్నా హక్కులు ఉన్నా యేమిటి?..."అన్నాడు.

"ఎందుకు లేవు? ఆ మీనాక్షి ఎవరో చెప్పాలి."

"ఏ మీనాక్షి.....?" గోపాలం అడిగినా, మీనాక్షి అతని కళ్ళలో మెదిలింది.

"మళ్ళీ మొదటికి రాగానే సరికాదు. మీరు రోజూ కలవరించే మీనాక్షి ..."

గోపాలం కలవరించినందుకు తిట్టుకున్నాడు. అప్పటికీ రోజూ 'రామస్కంధం, హను మంతం, వైనతేయం....' పఠిస్తూనే ఉన్నాడు,కర్మ! ఏం చేస్తాడు!

"ఆ అమ్మాయి ఈ ఊళ్ళోనే ఉందిగదా..."

"ఉంది...."

"మీ కెట్లా తెలుసు?"

గోపాలం ఇరుకున పడ్డాడు. ఆ అమ్మాయి ఇక్కడ ఉందని ఒప్పేసుకోవటంవలన తనకా అమ్మాయి సంగతులు తెలిసినట్లు అంగీకరించటమేగా!

"మీకు తెలుసని......నే నెప్పుడో గమనించాను. మీరు ఆ అమ్మాయిని నాకు చూపించాలి .."

"ఏమన్నా బొమ్మా ఏమిటే.....తీసుకువచ్చి చూపించటానికి?"

"మీరు తీసుకుని రానక్కర్లా. అక్కడికే పోదాం, ఆ బంగారు బొమ్మను చూడటానికి."

గోపాలం ఇరకాటంలో పడ్డాడు. తను పెళ్ళి చూడాలంటేనే కష్టమయిపోతున్నది. వాళ్ళు అంక్ష వేశారు. పైగా ఇప్పుడు పెళ్ళయింది తనకు. రోజూ చూడకపోతే బతకలే ననుకున్నాడు. ఈమధ్య ఆ అమ్మాయి కనపడి నెల రోజులయినా తను బాగానే ఉన్నాడు. కమలను తీసుకెళ్ళి ఏమని చూపిస్తాడు?

వాళ్ళింటికి ఏ ముఖం పెట్టుకుని వెళతాడు తను?

కమల ఊరుకోలేదు. చూపిస్తేనే గాని వీల్లేదంది. మీనాక్షి అన్నయ్య కనపడ్డాడు ఒక రోజున.

"పాత సంగతులన్నీ మరిచిపోదాం... నే



పరుగెత్తే మబ్బులు ఫోటో— 'భరద్వాజ' (మద్రాసు—18)

నిప్పుడు గృహస్థు నయ్యాను...మీరంతా మా ఇంటికి భోజనానికి రావాలి..." అన్నాడు. అంత గొప్ప ఐడియా తట్టినందుకు మెచ్చుకున్నాడు తనకు తానై.

"ఎందుకులే...." అన్నాడు అతను.

"మీరలా అంటే కాదు. నేను ఇక్కడ ఊరికే మాటగా చెప్పానుగాని....రేపు మీ ఇంటికి వచ్చి పిలుస్తాం" అన్నాడు.

అతను నిష్కర్షగా మాట్లాడాడు. "రానక్కర్లేదు..." అని చెప్పాడు. గోపాలానికి పచ్చి వెలక్కాయ రుచి చూసినట్లయింది. అయితే ఏమిటి గతి?

గోపాలానికి ఏమీ పాలుపోలేదు.

ఇంటికి వచ్చి తల పట్టుకుని కూర్చున్నాడు. కమలకు ఆ దృశ్యం చూస్తుంటే ఒళ్ళంతా గొంగళి పురుగులు పాకినట్లు ఉంటుంది. ఎవరో అందమైన అమ్మాయి కనపడి ఉంటుందని.... తనను పెళ్ళి చేసుకున్నందుకు విచారపడుతున్నాడని గట్టి నమ్మకం.

"మళ్ళీ అట్లా కూర్చున్నారేం?" అంది.

గోపాలం చర్రుమని లేచాడు.

"నువ్వు మళ్ళీ ఆ అమ్మాయి మాటెత్తావంటే ఇంకేం లేదు..." అన్నాడు.

"మీరు కలవరించకపోతే నే నెందుకు అంటాను?" అంది.

"....దుస్స్వప్నం తస్య నశ్యతి" అంటూ రాత్రి పడుకునే ముందర జపించి జపించి పన్నెండు గంటలదాకా నిద్ర పాడు చేసుకున్నాడు. కమల పక్కనే ఉంది.

"నేను కలలోకి వస్తానని మీకేం భయం అక్కర్లేదు.." అంది.

గోపాలం, మీనాక్షి కలలోకి రాకుండా ఉండాలని ఆమె మాటే తలుస్తూ పడుకున్నాడు. ఆలాపన కలలోకి వచ్చింది. మీనాక్షి ఎప్పుడూ లేనంత దగ్గరగా వచ్చింది. చిబుకం పట్టుకుంది. కమల అక్కడే ఉంది. అతనికి చెమటలు పోసినాయి. 'మీరు నన్ను చూడటానికి రావటం లేదు.....కలలో మిమ్మల్ని చూసే భాగ్యమైనా నాకు లేకుండా చేస్తారా? మావాళ్ళు మోసపోయారు. మీరు లేని నా జీవితం ఉప్పులేని పప్పు అయిపోయింది. ప్రియా...గోపాలా....' గోపాలం ఆమెను ఓదార్చాడు. నా పనీ అంతే అన్నాడు. 'నిన్ను చూడనిదే నేనూ ఉండలేకపోతున్నాను. ఎప్పుడూ నీ స్మరణే...నీవు లేని నా జీవితం పంచదారలేని కాఫీ అయిపోయింది...' అన్నాడు! 'మా అన్నయ్య వస్తున్నాడు... మన ప్రేమ సినిమాలో అన్నయ్యే విలన్. రాక్షసుడు' అంటున్నది. గోపాలం 'మీనాక్షీ...మీనాక్షీ...' అంటూ పిలిచాడు.

కమల మేలుకునే ఉంది. గోపాలం ముఖకవళికల్లో మార్పులన్నీ చూసింది. చెమట పట్టటం, సంతోషం, దుఃఖం, ఆనందాతిరేకం, భయం... అన్నీ. గోపాలాన్ని లేపింది. కంగారుగా కళ్ళు తెరిచాడు. కమలను మీనాక్షి అనుకుని గట్టిగా రెండు చేతులతో పట్టుకున్నాడు. కళ్ళు నులుముకుని చూశాడు.

"మీనాక్షి...మీనాక్షి అంటూ ఇక్కడలేని దాన్ని గూర్చి పొలికేకలు పెట్టడం ఎందుకు?" అంది.

గోపాలం తత్తరపోయాడు. "మళ్ళీ కలవరించానా..." అన్నాడు.

"ముఖాన చెమట తుడుచుకోండి....." అంది కమల.

గబుక్కున మంచందిగి చాప వేసుకుని

# రెండు జడల అమ్మాయి

పడుకుంది. గోపాలం కాసేపు అటూ ఇటూ చూశాడు. కళ్ళ ఎదుట కమల కనపడుతున్నది. అదీ ఉగ్రరూపంలో. కళ్ళు మూసుకుంటే మీనాక్షి కనపడుతుందేమో అని నిద్రకు ఉపక్రమించాడు. కలలో గూడా కమల వచ్చింది. 'మీనాక్షి గురించి కలవరిస్తారా..?' అంటూ గదమాయిస్తున్నది. హడలిపోయి కళ్ళు తెరిచాడు. చాపమీద నిద్రపోతూ కమల కనిపించింది.

"మీరు చూపించలేనంత మాత్రాన మునిగిపోతుం దనుకున్నారా?" అంది కమల ఒక రోజున, గోపాలం ఏమీ మాట్లాడకపోయేసరికి...

"ఏమన్నా కవిత్వం అల్లుతున్నారా?" అంది.

"కవిత్వం గాధు...వీరబ్రహ్మంగారి తత్త్వం!"

"అంత ఆక్రోశ ఎందుకు....ఆ మీనాక్షి మీద కవిత్వం వ్రాసేవారుటగా. ఇప్పుడు నామీద వ్రాయగూడదా ఏమిటి?" అంది

"నాదగ్గర ఆ అమ్మాయి మాట ఎత్తకు..."

కమల ఒక క్షణం ఆగి "నేను ఆ అమ్మాయిని నిన్న చూసివచ్చాను...." అంది.

గోపాలం గుండె ఒక క్షణం ఆగి కొట్టుకుందామా, వద్దా అని సంశయంలో పడింది.

"అంతా చెప్పింది" అంది. అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆగిపోయినాయి. తెప్పరిల్లి "ఏం చెప్పింది?" అన్నాడు.

"అంతా చెప్పింది..."

గోపాలం శరీరం కుర్చీలో తేలుతున్నది. కుర్చీ తిరుగుతున్నదో, భూమి తిరుగుతున్నదో నిర్ధారణగా తెలియటం లేదు గాని మొత్తంమీద తిరగటం కనిపిస్తున్నది.

"ఎక్కడకు వెళ్ళావు?" గోపాలం మధ్యమం నుంచి శ్రుతి పెంచాడు.

"ఎందుకు అలా గొంతు చించుకుంటారు? ఆ అమ్మాయి నిన్న గుళ్ళో కలిసింది...."

"ఆ అమ్మాయిని నీకు ఎట్లా తెలుసు?"

"అంత అందమైన అమ్మాయి అక్కడ ఇంకెవరూ లేరు....నీ పేరు మీనాక్షేనా—అని అడిగాను....అవునంది...."

"మంచి మర్యాద అక్కర్లా—నీ పేరేమిటి అని అడిగేసెయ్యటమేనా?"

"ఇందులో అమర్యాద ఏముంది? తిట్టానా—తిమ్మానా—"

"ఏం అడిగా వేమిటి?"

"అడగాల్సిన మాటలు నాయిగా అడిగాను."

"నీ కేమన్నా బుద్ధి వుందా?"

"లేదు .."

"నిజంగానే లేదు...."

"నేను కాదంటే గదా....ఆ అమ్మాయి చాలా మర్యాదగల పిల్లలాగానే ఉంది.....మా పేరు చెప్పి 'తెలుసునా!' అని అడిగాను.....'తెలియకేం?' అంది. 'వారు మా ఆయనేను....రోజూ మీ గురించి కలవరిస్తున్నారు...ఒకసారి వచ్చి చూసిపొండి' అని చెప్పాను..."

"అదేనా మాట్లాడే పద్ధతి...నన్ను అవమానం చెయ్యటానికి వేరే మార్గం దొరకలేదా నీకు?"

"మిమ్మల్ని అవమానపరిస్తే నాకు వచ్చేదేముంది.....?"

గోపాలం చివాలున లేచి వెళ్ళిపోయాడు. అతని మనస్సు తుఫాను దెబ్బ తింటున్న సముద్రంలాగా అయిపోయింది. మీనాక్షి కనపడే ఉంటుంది. పలకరించి ఉంటుంది గూడా. ఫలానా అని కమల ఎట్లా తెలుసుకుంది? ఏమో? ఆ అమ్మాయి ఏం చెప్పిందో? ఇదేం అడిగిందో!!! అతనికి ఏమీ పాలుపోలేదు. కంగారు అనే గాలిలో పడ్డ చేపలాగా అయిపోయాడు. ఈ ఊరినుంచి మారిపోతే? ఎక్కడకన్నా బదిలీ చేయించుకోవాలి. చదువు పూర్తి కాగానే ఉద్యోగంలో చేరాడు. అది గూడా ఎక్కువకాలం కాలేదు. బదిలీ అంటే నీళ్ళు లేని ఊళ్ళోవేస్తే? కాసేపు పార్కులో, కాసేపు రోడ్డుమీద తిరిగాడు. మనశ్శాంతికోసం సందులూ, గొందులూ గాలించాడు. సినిమాహాలుకు వెళ్ళి అక్కడ కాసేపు బొమ్మలు చూసి కాలక్షేపం చెయ్యవచ్చు అనుకున్నాడు. ఆట ఇంకా మొదలు కాలేదు. జనం లైనుగా నిలబడ్డారు. ఎరుగున్న వాళ్ళెవరైనా కనపడతారేమోనని చూశాడు. ఎవరూ లేరు. తిరిగి వస్తూంటే ఎవరో రెండు జడల అమ్మాయి కనపడింది. మీనాక్షి రెండు జడలు గుర్తుకు వచ్చినాయి. అటు తిరిగి ఎవరితోనో ఆ అమ్మాయి మాట్లాడుతున్నది...

కొంతదూరం వచ్చాక వెనక్కు తిరిగి చూసేసరికి మీనాక్షి వాళ్ళ అన్నయ్య కనపడ్డాడు. "నమస్తే" అన్నాడు. అతను వెంటనే పోల్చుకున్నాడు.

"సినిమాకు వచ్చాం" అన్నాడు అతను.

"అంతా వచ్చారా?"

"అమ్మావాళ్ళు రాలేదు ..నేనూ మీనాక్షి వచ్చాం....దాన్ని అక్కడ ఉండమని నే నిప్పుడే పాటల పుస్తకం కొనుక్కుని వస్తున్నాను" అన్నాడు. మీనాక్షి లోపల ఉందనేటప్పటికి గోపాలం తిరిగి చూశాడు. రెండు జడలమ్మాయి ఇంకా అటు తిరిగే ఉంది.

ఇంటికి వచ్చేసరికి తలుపు వేసిఉంది.

గోపాలం ఆలోచనలకు గొళ్ళెంవేసినట్లయింది. తలుపు తట్టాడు.

మెల్లిగా తలుపులు తెరుచుకున్నాయి. లోపల చీకటిగా ఉంది. "రండి " అంది ఎవరో రెండు జడలమ్మాయి.

"నేను మీకు తెలియదు...." అంది ఆ అమ్మాయి. ఆ చొరవకు నివ్వెరపోయాడు. తన ఇల్లేనా అని అనుమానం గూడా వేసింది.

"నా పేరు కామాక్షి...."

ఎక్కడో విన్నట్టుగా ఉందే ఈ పేరు?

"మీనాక్షి మా అక్కయ్య అవుతుంది.."

ఏ మీనాక్షి అని అడగలేకపోయాడు. లోపల ఇంకో రెండు జడలమ్మాయి కనపడింది. సినిమా హాలుదగ్గర చూసింది ఎవరిని? ఈ అమ్మాయి ఎవరు? కొంపతీసి మీనాక్షి ఇక్కడకురా లేదు గదా! ఆమె అన్నయ్య తనను ఏడిపించటానికి అట్లా చెప్పలేదు గదా!!

"లోపల ఎవరు?..."


"అక్కయ్య అవుతుంది..." అంది కామాక్షి.

"అవటమేమిటి? ఎవరు??" అన్నాడు, ఉత్సుకత నిలుపుకోలేక.

"కూర్చోండి. కాఫీ తీసుకుని వస్తాను" అంది కామాక్షి.

గోపాలం తల పట్టుకుని కూర్చుని వెంటనే కమల చూస్తుందేమోనని తలమీదనుంచి

జీవన పథం ఫోటో—ఎల్. ఆర్. గ్రోవర్ (రొహతక్)



చేతులు తీసేశాడు. కాఫీ వచ్చింది.

కాఫీ తాగగానే కామాక్షి గ్లాసు తీస్తూ "అక్కయ్య మిమ్మల్ని పిలుస్తోంది..." అంది.

"కమల ఎక్కడ....?"

"లోపలే ఉంది..."

గోపాలం ఆగ్రహం చెలియలి కట్ట తెంచుకుని రాబోయి మళ్ళీ తగ్గిపోయింది. సమయం కాదని మెల్లగా లేచివెళ్ళాడు. రెండు జడలమ్మాయి లేచి నిలబడింది.

"ఎప్పుడు వచ్చారు...." అన్నాడు గోపాలం తడబడుతూ. వెంటనే మాట సంబాళించుకున్నాడు. అంత పరిచయంగా మాట్లాడటం చాలా బుద్ధి తక్కువ పని అనుకున్నాడు. అక్కడ చెంపలు వాయించుకోవటానికి వీలుకాలేదు.

"ఎవరు.....పిలిచారుట!!" గోపాలం ఆ ఆ రెండుజడల వంక చూశాడు. తుమ్మెద రెక్కల్లాంటి జుట్టు....అంతేనా? నల్లత్రాచుల్లాగా రెండు జడలు కదులుతున్నాయి. మనసు ముందుకు తూగింది. అడుగు వెనక్కి లాగింది.

"ఎవరు..... పిలిచారుట..." అదే.. తెలివి తక్కువ మాట. అవసరమయినప్పుడు పనిమనుషుల్లాగానే తెలివితేటలు గూడా పిలుపుకు అందకుండా పోతాయి.

"నేనే.....కమలాక్షిని...."

గోపాలం నిర్ఘాంతపోయాడు. కమల వెనక్కి తిరిగి రెండు జడలు ముందుకు వేసుకుంది. చిరునవ్వు తళ తళ లాడింది. కళ్ళల్లో నీళ్ళు నిండి మెరమెర లాడుతున్నాయి. వెనక్కి తిరిగి చూశాడు. తలుపు తీసిఉంది. కామాక్షి వెళ్ళిపోయింది.

"ఈ వేషం ఏమిటి?"

"ఇప్పుడు బాగున్నానా?"

గోపాలం కమల ఆందోళన, నిష్కల్మషమైన ప్రేమాతిశయము చూడగానే నిలదొక్కుకోలేక పోయాడు. కమలను గట్టిగా కౌగలించుకున్నాడు.

"ఆ అమ్మాయి ఎవరు?"

"ఎరుగున్న అమ్మాయి .."

"మీనాక్షి వచ్చిందని ఎందుకు చెప్పింది..."

"నేనే చెప్పమన్నాను..."

"ఎందుకని...?"

"మీకు తెలియదా?"

"గుళ్ళో మీనాక్షిని రమ్మనమని చెప్పావన్నావుగా, రాలే దేం?"

"నాకు కనపడితే గదా అసలు..."

గోపాలం కమల ముఖం ఎత్తిచూశాడు. కళ్ళ వెంబడి నీళ్ళు జలజల రాలుతున్నాయి.

"నేను అందమైన దాన్నికాదు. కాని మీరు నన్ను ప్రేమగా చూడకపోతే బ్రతకలేను...." అంది.

బయట తలుపు చప్పుడయింది.

"ఎవరో వచ్చినట్లున్నారు..." కమల అతన్ని వదిలించుకుని బయటకు వచ్చింది. మొగ, ఆడ.....ఇద్దరు వచ్చారు.

"రండి..." అంది కమల.

"గోపాలంగా రున్నారా?"

"ఉన్నారు.....కూర్చోండి... పిలుచుకుని వస్తాను..."

కమల పిలవకముందే గోపాలం ఎదురయ్యాడు. తత్తరపాటుపడి వెంటనే సర్దుకుని "ఇట్లా రా కమలా" అంటూ పిలిచాడు. కమల వచ్చింది.

"కమల......నా భార్య .." అన్నాడు.

"నే నప్పుడే అనుకు న్నా..." వచ్చి నమ్మాయి అంది.

"మాకు సినిమా అందలేదు...ఇట్లా బయలు దేరి వచ్చాం...." అన్నాడు అతను.

"అహా....అట్లాగా..."

"మీకు పెళ్ళయిన తర్వాత బొత్తిగా కనిపించటం మానేశారు....అందుకని మా ఇంటికి పిలుచుకుని పోదామని వచ్చాము.....రేపు సెలవు రోజు కాబట్టి మీ రిద్దరూ తప్పకుండా రావాలి...." అన్నాడు అతను.

"అట్లాగే....దాని కేం?" అన్నాడు గోపాలం.

"కా ని ట యి ం లో వచ్చాం...రేపు అన్నీ మాట్లాడకుందాం....మా అమ్మా....నాన్న గూడా మీకోసం ఎదురు చూస్తూఉంటారు... అసలు రేపొద్దున వచ్చి పిలుద్దామనుకున్నాం.... సినిమా అందకపోయేటప్పటికి ఇలా వచ్చేశాం.."

**Read & Advertise In**
**The Largest Circulated Telugu Weekly**
**THE**
**ANDHRA PRABHA**
**Illustrated Weekly**

అన్నాడు అతను.

"అట్లాగే.....!"

వాళ్ళిద్దరూ లేచి బయటకు వచ్చారు. గోపాలం, కమల గూడా వాకిట్లోకి వచ్చారు.

"వస్తామండి" అని వాళ్ళు వెళ్ళిపోయారు.

"ఎవరో తెలుసా?" అని అడిగాడు.

"మీరు చెపితేనా...."

"ఆ అమ్మాయే. .నువ్వు చూడాలనుకున్న మీనాక్షి...."

"నిజంగా!!!" కమలకు ఏదో పెద్ద బరువు దించినట్టయింది. వాళ్ళు వెళ్ళినవైపు చూసింది. మీనాక్షి రెండు జడలు వీపుమీద పాకుతున్న తాచుల్లాగా ఉన్నాయి. ఆ అమ్మాయి గురించి కామాక్షి తనకు చెప్పింది. వాళ్ళు సందుమలుపు తిరిగేదాకా ఆగి లోపలకు వెళ్ళారు.

కమల రెండు జడలు గోపాలంమీదకు విసిరేస్తూ "అయితే రేపటినుంచి నా ముక్కుపుడక తీసేస్తాను" అంది.

"ఎందుకు?"

"మీనాక్షికి ముక్కుపుడక లేదుగా.."

గోపాలం కమలను దగ్గరగా తీసుకుని "నన్ను క్షమించు కమలా...." అన్నాడు.

"అంతదాన్నా..."

"క్షమించానంటేనే గాని ఊరుకునేది లేదు... నువ్వు మీనాక్షిలాగా ఉండక్కర్లేదు...కమలలాగానే ఉండు .. ముక్కుపుడక తియ్యొద్దు. రెండు జడలు వేసుకోనూ వద్దు..."

కమల అతని పాదాలకు నమస్కరించి వెళ్ళింది. గోపాలం కుర్చీలో చేరగిలబడి అద్దంలో ముఖం చూసుకుంటూ తల దువ్వుకో సాగాడు. అద్దంలో అందమైన కమల కనిపించింది. ★

ఏకాంతంలో ప్రశాంతం ఫోటో—ఎస్. జి. శేషగిరి (కోయంబత్తూరు-9)

